క్లుప్తంగా

విక్రయానికి సిద్ధంగా మామిడి, కొబ్బరి మొక్కలు

మాడుగుల రూరల్: ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఉద్యానవన పంటలుగా మామిడి, జీడి, కొబ్బరి, నిమ్మ మొక్కలు వేసుకోవచ్చునని ఏవో వి. భాను పుష్పలీలావతి ఆదివారం తెలిపారు. ఈ మొక్కలు అనకాపల్లి సమీపంలోని ఉద్యానవన శాఖ కార్యాలయం ఆవరణలో విక్రయానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మామిడి రూ.45, జీడి రూ.40, కొబ్బరి రూ.90, నిమ్మ రూ.25 చొప్పున విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నేడు

దేవరాపల్లి: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని ఆపరేషన్లకు ఎంపిక చేసి విశాఖలో కంటి ఆస్పత్రికి తీసుకెళ్తామన్నారు. రోగులు ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న యువకులు


మాకవరపాలెం: భీమబోయినపాలెంలో సాయానికి పది రూపాయలు సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ శిబిరంలో స్థానికులతోపాటు వివిధ గ్రామాలకు చెందిన 105 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సంస్థ ద్వారా పేదలను ఆదుకోవడంతోపాటు పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని నిర్వాహకులు తెలిపారు.

మోదమాంబ మాలధారణ


అమ్మవారి మాలధారణ వేస్తున్న గురుమాత శ్రీనివాసరావు

మాడుగుల రూరల్: వీరవల్లి మోదకొండమ్మ పీఠంలో ఆదివారం పది మంది భక్తులు మోదమాంబ మాలధారణ చేశారు. గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు సారధ్యంలో గాజువాక, మాటూరు, వి.వి.అగ్రహారం గ్రామాలకు చెందిన భక్తులకు మాలలు వేశారు. అనంతరం పీఠంలో సత్యనారాయణ వ్రతాలు చేయించారు.

కేశవ స్వామికి లక్ష తులసి పూజ


లక్ష తులసి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ, కుటుంబ సభ్యులు

చోడవరం: స్థానిక ప్రాచీన దేవాలయంలో కేశవ స్వామివారికి ఆదివారం లక్షపత్రి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కుటుంబ సమేతంగా ఈ పూజలో పాల్గొన్నారు. తులసి, కుంకుమతో ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు ఈ పూజ చేశారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన కేశవ స్వామివారికి తులసితో లక్ష పత్రి పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 144 సెక్షన్ అమలు

మాడుగుల రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్ఐ పి. దామోదర్‌నాయుడు ఆదివారం తెలిపారు. ఒకే చోట గుమిగూడినా, సమావేశాలు పెట్టినా అట్టివారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్‌లు వంటివి నిషేధించామన్నారు. ఊరేగింపులు, ర్యాలీలకు ఎటువంటి అనుమతి లేదన్నారు. బాణసంచా కాల్చితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ప్రజలకు, రాజకీయ నాయకులకు విజ్ఞప్తి చేశారు.

మామిడి.. తగ్గిన దిగుబడి

- దక్కని మద్దతు ధర
- వర్షాభావం, పొగమంచుతో తగ్గిన కాపు
- పెట్టుబడులు తిరిగిరాని పరిస్థితి
- రైతుల దిగాలు


మామిడి కాయలు


గొట్లాంలో కాపు లేని మామిడి తోటలు


ఎగుమతికి పెట్టెల్లో సిద్ధం చేస్తున్న మామిడికాయలు

కె.కోటపాడు: మామిడి పంట దిగుబడి తగ్గడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. మొదట్లో వర్షాభావంతో అరకొరగా పూత వేయగా, అదే సమయంలో పొగమంచు వల్ల కొంతమేర నేల రాలిపోయింది. ఇప్పుడు కాసిన కొద్దిపాటి కాయలు ఇటీవల వర్షాలకు నేలరాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. పైగా ఇటీవల తీవ్ర ఎండలకు కాయలు పాడై మార్కెట్లో సరైన ధర లేకపోవడంతో నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో గొట్లాం, శృంగవరం, మత్రివలస, పాతవలస, ఆర్లి, పిండ్రంగి, చింతపాలెం, దాలివలస, కె.కె.అగ్రహారం, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, గొండుపాలెం, పాతవలస, కొరువాడ, తదితర గ్రామాల్లో మామిడి తోటలను 1,250 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పండిన మామిడి పంటను కోల్‌కత్తా, ఢిల్లీ, హైదరాబాద్, విశాఖపట్నం, తదితర ప్రాంతాల్లో మామిడి వ్యాపారులకు బాక్సుల్లో అమ్మకాలు చేస్తుంటారు.

పెరిగిన పెట్టుబడులు... తగ్గిన దిగుబడి

ఎకరా పొలంలో మామిడి పంటకు ఏటా సస్యరక్షణ చర్యలలో భాగంగా దుక్కులు, మొక్కల మొదళ్లలో పాదె, పూత నిలిచేందుకు రసాయన ఎరువులకు పెట్టుబడుల కింద రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేశారు. ఈ ఏడాది మండల వ్యాప్తంగా వర్షపాతం తక్కువగా ఉండడం వల్ల ఈ ప్రభావం మామిడి పూతపై పడింది. కొద్ది పాటిగా చెట్లకు వచ్చిన పూత శీతాకాలంలో పొగమంచు, తేనె మంచు కురవడం వల్ల రాలిపోయింది. చెట్లుకు కాసిన అరకొర మామిడి ఇటీవల అడపాదడపా ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో నేల రాలిపోయింది. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా కాస్తుండటంతో మామిడికాయలు పాడై మార్కెట్‌లో ధర తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మామిడికాయల బాక్స్ (60 కాయలు) రూ.500 నుంచి రూ.600 వరకు మాత్రమే అమ్ముడుపోతోంది. ఇదే బాక్సు వారం రోజుల క్రితం రూ.1150 నుంచి రూ.1250 వరకు విక్రయించేవారు. ఇప్పుడు వాతావరణ పరిస్థితుల కారణంగానే మామిడి పంటకు మద్దతు ధర లభించని పరిస్థితి ఏర్పడింది. మామిడి సాగుకు పెట్టిన పెట్టుబడులు పొందలేని పరిస్థితి నెలకొందని సాగు రైతులు వాపోతున్నారు. మధుర ఫలమైన మామిడి సాగుతో నష్టాలే మిగిలాయని చెబుతున్నారు.

నష్టాలే..



ఈ ఏడాది వర్షాలు పెద్దగా లేకపోవడంతో మామిడి చెట్లకు పూత తగ్గింది. కొద్ది పాటి వచ్చిన పూత శీతాకాలంలో కురిసిన మంచుకు రాలిపోయింది. వేలాది రూపాయలను మామిడి తోటలకు పెట్టుబడిగా పెట్టాను. ప్రస్తుతం పంట అమ్మకాలు చేయడం ద్వారా పెట్టుబడులను రాబట్టలేని పరిస్థితి నెలకొంది.

– కె.ఈశ్వరరావు, మామిడి సాగు రైతు, గొట్లాం

ఆర్బీకేల్లో విక్రయానికి వరి విత్తనాలు

మాడుగుల రూరల్: ఖరీఫ్ వరి విత్తనాలు త్వరలో రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయిస్తామని ఏవో ఎం. వాసుదేవరావు ఆదివారం తెలిపారు. ఆర్.జి.ఎల్, సాంబమసూరి, 1061 (ఇంద్ర), వరి రకాలు 1063 క్వింటాళ్లు మండలంలో రైతు భరోసా కేంద్రాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచామన్నారు. ఈ విత్తనాలు మొలకశాతం 85 శాతం దాటితే ఈ నెల 6వ తేదీ నుంచి విక్రయిస్తామన్నారు. సోనామసూరి, స్వర్ణ, 1064 అమర్ విత్తనాలు 127 క్వింటాళ్లు విక్రయానికి సిద్ధంగా ఉంచామన్నారు. వీటి మొలకశాతం అనుసరించి విక్రయాలు ప్రారంభిస్తామన్నారు. ఇవి 22 ఆర్బీకేల్లో వీఏఏ, వీహెచ్ఏల సారథ్యంలో విక్రయిస్తారన్నారు.

50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు..

రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయని ఏవో వాసుదేవరావు తెలిపారు. జీలుగు, జనుము, విత్తనాలు సబ్సిడీ పోను కిలో రూ.44 కాగా, పిల్లి పెసర రూ.67కు విక్రయిస్తున్నట్లు చెప్పారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


చౌడువాడలో వేసవి విజ్ఞాన తరగతులకు హాజరైన విద్యార్థులు


దేవరాపల్లిలో పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

దేవరాపల్లి: పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా అపార విజ్ఞానం పెంపొందించుకోవచ్చునని గ్రంథాలయ అధికారి ఓ. శ్రీనివాసరావు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. బొమ్మలు చెప్పిన కమ్మని కథలు పుస్తకంలోని అమ్మ మాటను తెలియజేశారు. ఈ నెల 7వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. రిసోర్స్ పర్సన్ కె. అప్పారావు పాల్గొన్నారు.

కె.కోటపాడు: వేసవి విజ్ఞాన తరగతులతో గ్రంథాలయపై ఆసక్తి పెరుగుతుందని గ్రంథాలయాధికారి పద్మావతి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంతోపాటు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 8న బహుమతులను అందించనున్నట్లు తెలిపారు.

రోలుగుంట: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారం కొనసాగాయి. దీనిలో భాగంగా దేశ నాయకులు గాంధీజీ, నెహ్రూ, అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 25 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారి ప్రతిభ చూపించారు. గ్రంథాలయాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందే ఉద్యోగికి గుర్తింపు


కోటయ్య మాస్టారు దంపతులను సత్కరిస్తున్న ఎంఈవోలు అమృత్‌కుమార్, వరహాలబాబు

నాతవరం: ప్రజల మన్ననలు పొందే విధంగా పని చేసే ప్రతి ఉద్యోగికి సమాజంలో ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ తెలిపారు. డి.యర్రవరం ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కొండ్రు కోటయ్య పదవి విరమణ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కూండ్రపు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నాతవరం స్కూల్‌లో కోటయ్య మాస్టారు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ కావడం పదవీ విరమణ చేయడం సహజమన్నారు. ఇతర వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. పదవీ విరమణ చేసిన తర్వాత గురువులకు తన శిష్యుల నుంచి ఆప్యాయత అనురాగాలు ఉంటాయన్నారు. మిగతా ఉద్యోగులకు అటువంటి అవకాశం ఉండదన్నారు. తల్లిదండ్రులు తర్వాత స్థానం ఉపాధ్యాయుడిదే అన్నారు. దీన్ని గుర్తించి ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పని చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎంఈవో 2 కామిరెడ్డి వరహాలబాబు, ఏపీటీఎఫ్ జిల్లా నాయకుడు ఎస్వీ సత్యనారాయణ, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పైల పోతురాజు, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీపీ నేతల విజయకుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టరు ఇట్టంశెట్టి సీతారామమూర్తి, సీఆర్పీలు పాలుపర్తి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి, గోవిందు, జ్యోతికుమారి, ఎంఆర్సీ స్టాఫ్ అంకంరెడ్డి శ్రీనివాస్‌నాయుడు, సాంబనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు

మాడుగుల రూరల్: చోడవరం సహాయ సంక్షేమ వెనుకబడిన తరగతుల పరిధిలో వసతి గృహాల్లో ఖాళీ సీట్లు కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని చోడవరం సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి (ఏబీసీడబ్ల్యూ) ఎం. నర్సింహులు తెలిపారు. ఆదివారం ఆయన మాడుగులలో మాట్లాడుతూ తమ పరిధిలో 16 పాఠశాలలు, కళాశాలల వసతి గృహాలు ఉన్నాయన్నారు. మాడుగులలో కళాశాల బాలికల వసతి గృహంతోపాటు కింతలి, మాడుగుల, బాలుర వసతి గృహాలు ఉండగా, దేవరాపల్లి-1 , కె. కోటపాడు-3, చోడవరం -4, వడ్డాది -1 బుచ్చెయ్యపేట -1, చీడికాడ - 2 చొప్పున వసతి గృహాలు ఉన్నాయన్నారు. వీటిలో కళాశాల వసతి గృహాలు ఈ నెల ఒకటి నుంచి ప్రారంభించగా, పాఠశాల వసతి గృహాలు 12వ తేదీ నుంచి ప్రారంభిస్తామన్నారు. ఖాళీ సీట్ల కోసం 9441293675 సంప్రదించాలని కోరారు.

ఒమ్మలిలో ఘనంగా మోదకొండమ్మ పండగ

మాడుగుల: ఒమ్మలి గ్రామంలో మోదకొండమ్మ పండగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉగ్గిన వెంకటరమణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలతో డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పుసుపుకుంకుమలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


ఘటాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో చివరి అంకమయిన లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కీలకమైన కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు సిద్ధం చేస్తోంది. ఈ నెల 4వ తేదీన పాయకరావు నియోజకవర్గ ఎన్నికల లెక్కింపు జరగనుంది. ప్రధానపార్టీలతో పాటు ఇండిపెండెంట్ల నుంచి 9 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 21 రౌండ్ల ద్వారా ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు తమ తరపున ఏజెంట్లను ఏర్పాటు చేస్తారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 105 మంది కౌంటింగ్ ఏజెంట్లను, ఐదుగురు జనరల్ ఏజెంట్లతో పాటు లెక్కింపు ప్రక్రియల్లో పాల్గొంటున్నారు. వీరందరి నుంచి ముందుగానే వివరాలు సేకరించారు. పోటీలో ఉన్న అభ్యర్థి ధ్రువీకరణతో వీరందరిని కౌంటింగ్ ఏజెంట్లుగా గుర్తించినట్టు ఆర్వో గీతాంజలి తెలిపారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే అభ్యర్థులతో పాటు కౌంటింగ్ ఏజెంట్లు, జనరల్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. ఫొటోతో ఉన్న గుర్తింపు కార్డులు వీరందరికి జారీ చేస్తారు. ఆర్వో ధ్రువీకరించిన ఈ గుర్తింపు కార్డులు తీసుకుని 4వ తేదీ ఉదయం 6 గంటల లోపు వీరంతా కౌంటింగ్ కేంద్రాలకు హాజరుకావాలని ఎన్నికల అధికారులు తెలిపారు. కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను ఇప్పటికే తెలియజేయడం జరిగిందన్నారు. గుర్తింపు కార్డులు సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. సోమవారం వీరందరికీ కార్డులు అందజేయనున్నట్టు తెలిపారు.


గుర్తింపు కార్డులు సిద్ధం చేసే పనిలో అధికారులు

ఉపాధితో పల్లెల ప్రగతి


వల్లంపేటలో పటిష్టం చేసిన చెరువు గట్టు

మండలంలో మొత్తం జాబ్‌కార్డుల సంఖ్య :	20,479
ప్రస్తుతం పనులకు వస్తున్న వేతనదారులు :	12,539 మంది
ఇంతవరకు ఖర్చు చేసిన నిధులు :	రూ.16 కోట్లు 67 లక్షల 43 వేలు
మండలంలో హౌసింగ్ లబ్ధిదారులు :	1023 మంది
90 రోజుల చొప్పున పని దినాలు చేసిన కూలీలు :	6,263 మంది
వేతనాల రూపంలో చెల్లింపులు :	కోటి 62 లక్షల 34 వేల 695 రూపాయలు
మిగతా లబ్ధిదారులకు విడతల వారీగా ఖాతాల్లో జమ	
ఇంకుడు గొయ్యి, మరుగుదొడ్డికి అదనపు చెల్లింపులు	

- ఉపాధి హామీ నిధులతో 97 రకాల పనులు
- 6.28 లక్షల మందికి పని
- రూ.16.67 కోట్ల ఖర్చు


పంట కాలువ భాగు చేయడంతో ప్రవహిస్తున్న నీరు

నాతవరం: ఉపాధి హామీ పథకం నిధులతో వేతనదారులకు పుష్కలంగా పనులు కల్పించడంతోపాటు పలు అభివృద్ధి పనులు ప్రభుత్వం చేపట్టింది. వీటితోపాటు ఈ పథకంలో 97 రకాల పనులు చేసేందుకు అవకాశం కల్పించింది. చెరువులు, పంట కాలువల అభివృద్ధి చేయుటతోపాటు పండ్ల తోటల పెంపకం, వ్యక్తిగత పనులు, ఇళ్ల నిర్మాణం, చేపలు చెరువులు, కూరగాయలు పెంపకానికి సైతం నిధులు ఖర్చు చేస్తోంది.

తోటలు పెంపకం వివరాలు..

- మూడేళ్లపాటు తోటల పెంపకానికి మొత్తం 217 మంది రైతులకు ఎకరం ఒక్కంటికి లక్షా 25 వేల రూపాయల చొప్పున 259 హెక్టార్లలకు నిధులు మంజూరు.
- మండలంలో 40 చెరువుల గట్లపై 4 వేల కొబ్బరి మొక్కలు నాటారు. ఎస్సీ, ఎస్టీ భూముల్లో ప్రత్యేక భూమి అభివృద్ధి పథకం ఆయా రైతుల అభీష్టం మేరకు పండ్ల మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తోంది.
- సొంతంగా భూముల అభివృద్ధి చేసుకోవడానికి గిరిజనులకు ప్రభుత్వం అటవీ హక్కు పత్రాలు ఇచ్చింది.
- వీటితోపాటు పండ్ల తోటలు పెంపకానికి అదనంగా నిధులు మంజూరు


చెరువు గట్టుపై కొబ్బరి మొక్కలు పెంపకం


నీరు నిల్వ ఉండేందుకు చెట్టు చుట్టూ తవ్విన ట్రెంచ్‌లు


ఉపాధి నిధులతో కూరగాయల సాగు

- గిరిజన కూలీలకు అదనంగా మరో 50 రోజులు కలిపి 150 పని దినాలు కల్పిస్తోంది.


ఎస్.బి.పట్నంలో చేపల చెరువుల ఏర్పాటు


చెరువులో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

పూడిక తీతతో తొలగిన ఇబ్బంది

మా పొలాలకు గతంలో నీరు ప్రవహించక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ఇటీవల ఉపాధి హామీ పథకంలో వీఆర్పీ రామారావు పర్యవేక్షణలో కాలువలో పూడిక తీసి శుభ్రం చేయించారు.

లగుడు నాయుడు, డి.యర్రవరం పంచాయతీ, యరకంపేట గ్రామం

ఉపాధితోపాటు అభివృద్ధి పనులు

మండలంలో ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని కల్పిస్తున్నాం. వీరితో పలు అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. ఈ పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. ఏప్రిల్ నుంచి కూలీలకు రోజు ఒక్కంటికి రూ. 300 కూలి చెల్లిస్తున్నాం.

జాగరపు రాంబాబు, ఎంపీడీవో, నాతవరం

లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్

మునగపాక : విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకోవాలని తద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు పేర్కొన్నారు. మండలంలోని మంగళవరపుపేటలో మాఊళ్లో గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా చదవడం అంటే మాకు ఇష్టం ముగింపు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో సమయాన్ని వృథా చేయకుండా ఇటువంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిష్ణాతులైన వారు అందించిన సూచనలు పాటించాలన్నారు. చదువులో ఏకాగ్రత అలాగే విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. మంచి ఫలితాలు రావాలంటే ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలన్నారు. శిక్షణలో సేవలందించిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సత్కరించారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు శిష్టా తమ్మిరాజు, మొల్లేటి సత్యనారాయణ, కేవీ రమణలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ ప్రతినిధులు భీశెట్టి ధనశ్రీను, యల్లపు సంజీవరావు, ఆడారి అప్పలనాయుడు, సన్యాసినాయుడు, రామసన్యాసి అప్పారావు, కొయిలాడ నరసింగరావు , లక్ష్మి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీనివాసుని కల్యాణం

మునగపాక : మండలంలోని నాగులాపల్లిలో ఆదివారం కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. పాటిమీద స్వయంభువుగా వెలసిన ఆలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిగింది. ఆలయ చైర్మన్ దాడి ప్రకాష్, విల్లూరి పరమేశ్వరరావు, శిల్పి దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం అలాగే సంకీర్తనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. శ్రీవారి పల్లకి కమిటీ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణం తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.